క్లుప్తంగా

రేపటి నుంచి అన్నవరప్పాడు వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు


అలివేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఆదివారం ప్రారంభం అవుతున్నాయి. మే 5వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కార్య నిర్వహణాధికారి జీఎస్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం స్వామి వారికి లక్ష తులసిపూజ, స్నపన, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహిస్తారు. తులసి పూజలో 108 దంపతులు పాల్గొంటారు. మే 1న అఖండ శ్రీరామ నామ సంకీర్తన జరుగుతుంది. అదేరోజున స్వామి,అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. 2,3,4,5 తేదీల్లో స్వామివారికి ఉదయం, సాయంత్రం భక్తులచే కల్యాణం జరుగుతుంది. 5వ తేదీ సాయంత్రం స్వామివారికి పుష్ప యాగోత్సవం, పవళింపు నిర్వహిస్తారు. జరుగుతుందన్నారు. ఉత్సవాల ఐదు రోజులూ ఉదయం, సాయంత్రం భక్తులకు అన్న సమారాధన చేస్తారు. రోజూ భజన, కోలాటం బృందాల ప్రదర్శనలతో పాటు సాయంత్రం వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు అన్నదేవరపేటలో గడప గడపకూ..

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి క్యాంపు కార్యాలయ వర్గాలు కోరారు.

నేడు మున్సిపల్ సమావేశం

నిడదవోలు రూరల్: నిడదవోలు పురపాలక సంఘ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కేవీ పద్మావతి శుక్రవారం తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేస్తారన్నారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు విధిగా సమావేశానికి రావాలని ఆమె కోరారు.

రేపు కొవ్వూరులో వాసవీ మాత జయంతి

కొవ్వూరు: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం 10.35 గంటలకు అమ్మవారికి సహస్ర నామ కుంకుమార్చనతో పాటు క్షీరాభిషేకం, పంచామృతాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే అమ్మవారికి గులాబీలతో అర్చన, డ్రై ఫ్రూట్స్‌తో అభిషేకం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్న సమారాధన జరుగుతుందన్నారు.

3న లారీ బహిరంగ వేలం

ఉండ్రాజవరం: మద్యం అక్రమ తరలింపు కేసులో పట్టుబడిన లారీని మే నెల 3న బహిరంగ వేలం వేస్తామని స్థానిక ఎస్సై కె.రామారావు శుక్రవారం తెలిపారు. 2021లో మద్యం తరలిస్తున్న ఏపీ-37 టీజే 1499 నంబర్ గల లారీని సీజ్ చేసి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉత్తర్వుల మేరకు ఈ లారీని మే 3 ఉదయం 10 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం వేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈవేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం పాటకు వచ్చేవారు ఆధార్ కార్డు వెంట తీసుకు రావాలన్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరిస్తాం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వేదిక చైర్మన్ సత్యనారాయణ

దేవరపల్లి: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికి వేదిక ఏర్పాటు చేసినట్టు వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ తెలిపారు. విద్యుత్తు వినియోదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో స్థానిక శ్రీచైతన్య స్కూల్లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సత్యనారాయణ మాట్లాడుతూ వేదిక దృష్టికి వచ్చిన విద్యుత్తు సమస్యలను 60 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, ఇతర సమస్యలను వేదిక ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు. విద్యుత్తు వినియోగంలో ఎదురవుతున్న ఇబ్బందులను వేదిక దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు ఆర్.సురేంద్రకుమార్, పి.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు, డీఈఈ వి.రవిశంకర్, ఏఈలు కేవీ కృష్ణారావు, మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతిరుపతిలో బ్రహ్మోత్సవ వైభవం

- రేపటి నుంచి శ్రీవారి తిరుకల్యాణోత్సవాలు
- మే 4న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం
- 5వ తేదీ రాత్రి రథోత్సవం


ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం ఏరియల్ వ్యూ

ద్వారకాతిరుమల: స్థానిక చిన్న తిరుమలేశుని బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. మే 7 వరకూ 8 రోజుల పాటు శోభాయమానంగా సాగే శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఏటా క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమోక్తంగా రెండుసార్లు నిర్వహించడం సంప్రదాయం. స్వామివారికి నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవాలతో పాటు ఈ బ్రహ్మోత్సవాలను కూడా అట్టహాసంగా జరుపుతారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో స్వామివారు ఉభయ దేవేరులతో కలసి ఉదయం, సాయంత్రం వేళల్లో పలు వాహనాలపై తిరువీధుల్లో విహరించనున్నారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రోజుకో విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణ వేదికపై ఉదయం నుంచి రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

ఉత్సవాలు జరిగేదిలా..

- ఈనెల 30 ఉదయం శ్రీవారిని పెండ్లి కుమారుడు, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా చేస్తారు. ఆ రోజు రాత్రి 7 గంటల నుంచి గజ వాహనంపై గ్రామోత్సవం.
- మే 1 రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, రుత్విగ్వరణ అనంతరం ధ్వజారోహణ నిర్వహిస్తారు. రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై గ్రామోత్సవం


గజ వాహనాన్ని కడుగుతున్న ఆలయ సిబ్బంది


శ్రీవారి పాదుకా మండపం వద్ద తాటాకు పందిరి నిర్మిస్తున్న సిబ్బంది

- 2 ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం
- 3 ఉదయం 7 నుంచి హనుమ ద్వాహనంపై గ్రామోత్సవం. రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 8.30 గంటల నుంచి వెండి శేష వాహనంపై గ్రామోత్సవం
- 4న రాత్రి 8.30 గంటల నుంచి స్వామివారి తిరు కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం


ఉభయ దేవేరులతో శ్రీవారు

, అదే రోజు ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై తిరువీది సేవ.

- 5 రాత్రి 7.30 నుంచి క్షేత్ర పురవీధుల్లో రథోత్సవం.
- 6న ఉదయం 10.30 నుంచి చక్రవారి-అవభృధోత్సవం, మధ్యాహ్నం 3 నుంచి వేద సభ, రాత్రి 7 నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 8 గంటల నుంచి అశ్వ వాహనంపై గ్రామోత్సవం.
- 7 ఉదయం 9 నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగము-పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

శ్రీవారి ప్రత్యేక అలంకారాలు ఇవీ..

ఈనెల 30న శ్రీ భూసమేత మహావిష్ణువు
మే 1న కాళీయమర్దనం
2న శ్రీరామ శివధనుర్భంగం
3న సత్యభామ శ్రీకృష్ణుడు
4న మోహిని
5న గురువాయూర్ కృష్ణ
6న నవనీత కృష్ణ
7న శయన మహావిష్ణు

ఊపందుకున్న ఏర్పాట్లు..

బ్రహ్మోత్సవాలకు సమయం ఆసన్నం కావడంతో ఏర్పాట్లు ఊపందుకున్నాయి. స్వామివారి వాహనాలను శుభ్రం చేయడం, ఆలయ పరిసరాల్లో తాటాకు పందిళ్ల నిర్మించడం, విద్యుద్దీప అలంకారాలు చేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

సాధారణ భక్తులకు పెద్ద పీట



శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు విచ్చేసే వీఐపీలు, వీవీఐపీలతో పాటు సాధారణ భక్తులకు పెద్దపీట వేస్తాం. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. 8 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావాలి. మే 4న స్వామివారి కల్యాణం, 5న రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తాం. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 30 నుంచి వచ్చేనెల 7 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేశాం. భక్తులు గమనించాలి.

– వేండ్ర త్రినాథరావు – శ్రీవారి దేవస్థానం ఈఓ

జగనన్న చొరవతో పేదలకు ఇళ్ల పట్టాలు

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో 781 మందికి పంపిణీ
- 13 ఏళ్ల సమస్యకు మోక్షం


కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు


ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి వనిత, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

కొవ్వూరు: పేదలకు మేలు చేకూర్చేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం 60, 225 జీవోలను జారీ చేయడంతో ఇందిరమ్మ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు అందించగలుగుతున్నామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. తన హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమష్టిగా పనిచేయడం వల్ల త్వరగా ఇళ్ల పట్టాలు అందించ గలిగామన్నారు. తొలి విడతగా 781 మందికి అందిస్తున్నామన్నారు. ఈ ఇళ్ల పట్టాల ద్వారా గృహాల నిర్మాణానికి బ్యాంకులో రుణం పొందవచ్చున్నారు. పదేళ్ల తర్వాతే లబ్ధిదారులు అమ్ముకునే అవకాశం ఉందన్నారు. అర్హులందరికీ పట్టాలు ఇస్తున్నామని, ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉంటే వారికి కూడా న్యాయం చేస్తామన్నారు. గత 13 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పట్టాల సమస్యకు పరిష్కారం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి జారీ చేసిన 60 నంబర్ జీవో వల్ల పేదల కలను సాకారం చేయగలిగామన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పేదలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ ఇక్కడి ఇందిరమ్మ కాలనీ వాసులకు వైఎస్సార్ హయాంలో ఇళ్లు, స్థలాలు ఇచ్చారన్నారు. పట్టాలు లేకుండా ఇప్పటి వరకూ నివాసం ఉంటున్న లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం అభినందనీయం అన్నారు. దీనికి హోమ్ మంత్రి వనిత కృషి ఎంతో ఉందో ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ కాలనీలో 1,055 మంది అర్హులుగా గుర్తించామన్నారు.ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి వనిత, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ గండ్రోతు అంజనీదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్ తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, కమిషనర్ బి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేగేశ్వరపురం మేరీమాత ఉత్సవాలు ప్రారంభం


మేరీమాత ఉత్సవాల ప్రారంభోత్సవంలో భక్తుల ప్రార్థనలు

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు మేరీమాత తేరు ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 30 వరకూ మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఆ పుణ్య క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ టి.జాన్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో పరిశుద్ధ జపమాల, దివ్యబలిపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పలువురు ఫాదర్లు ప్రసంగించారు. గోదావరి మేరీమాత గాయక బృందం గీతాలు ఆలపించారు. మేరీమాత ఆలయంలోని విగ్రహాలకు పూలమాలలు వేసి ఉత్సవాలు ప్రాంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మేరీమాతకు కానుకలు సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు.

శంకర మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు

కొవ్వూరు: శంకర జయంత్యుత్సవాల్లో భాగంగా స్థానిక గౌతమీనగర్‌లోని శంకర మఠంలో శుక్రవారం ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ప్రముఖ పండితుడు నోరి భోగేశ్వరశర్మ సోమయాజులు బ్రహ్మ సూత్ర శంకర భాష్య పఠనం చేశారు. ప్రముఖ జ్యోతిష్య పండితుడు మల్లాది కల్యాణ్‌కుమార్ సౌందర్యలహరి పారాయణ చేశారు. సాయంత్రం మహా మహోపాధ్యాయ శలాక రఘునాథశర్మ ప్రవచనం జరిగింది. పట్టణ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, జీబీవీ సుబ్రహ్మణ్యం, సీహెచ్ సుబ్రహ్మణ్యం, తుట్టగుట్ట భైరవమూర్తి, పాలకోడేటి సత్యనారాయణమూర్తి తదితరుల పలు ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు. శనివారంతో శంకర జయంత్యుత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

మిల్లర్ల నిర్ణయానికి వ్యతిరేకంగా రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న రైతుల సమస్యను తెలుసుకుంటున్న ఎస్‌ఐ రామకృష్ణ

గోపాలపురం: విక్రయించిన రబీ ధాన్యంలో 5 నుంచి 10 శాతాన్ని నూకల పరిహారంగా చెల్లించాలంటున్న మిల్లర్ల డిమాండ్‌ను వ్యతరేకిస్తూ రైతులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇదే సమస్యపై మండలంలోని చెరుకుమిల్లి గ్రామరైతులు కోమటికుంట మాతంగి అమ్మ రైతు మిల్లు వద్ద రెండు రోజుల క్రితం నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. మిల్లర్ల వ్యవహారంపై రైతులు శుక్రవారం తహసీల్దార్ బి.రవీంద్రనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్, ఎస్‌ఐ రామకృష్ణలు ఫోన్‌లో ఇక్కడి పరిస్థితిని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌కు వివరించారు. దాంతో సోమవారం మండలానికి వచ్చి రైతులను కలిసేందుకు జేసీ అంగీకరించారు. ఈ విషయం తహసీల్దార్ రైతులకు చెప్పడంతో వారు శాంతించి, నిరసన విరమించారు.

విద్యుత్తు సమస్యల పరిష్కారానికే న్యాయస్థానం

- రిటైర్డ్ జడ్జి సత్యనారాయణ
- గోపాలపురంలో విద్యుత్తు వినియోగదారుల సదస్సు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ

గోపాలపురం: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానాన్ని ఏర్పాటు చేసిందని, ఆ సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ సత్యనారాయణ మాట్లాడారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల్లో విద్యుత్తు పంపిణీలో ఎదురయ్యే సేవా లోపాలను న్యాయస్థానం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. భారత్ విద్యుత్ సంస్థ చట్టం 2003 ప్రకారం విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో కంటే విద్యుత్ సమస్యలు తక్కువగా ఉన్నాయన్నారు. వినియోగదారులు వ్యక్తిగతంగా లేదా పోస్టు, ఆన్‌లైన్ ద్వారా సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబరు 1912కు కాల్ చేసి సమస్యను వివరించాలని సూచించారు. కమిటీ సభ్యులు పి. శ్రీనివాస్, రాయసం సురేంద్రకుమార్, నిడదవోలు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి వీరభద్రరావు, ఏడీఈ కె.రవిశంకర్, ఏఈ అయినాల మల్లేశ్వరరావు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరం కాలువ గట్టు ఆక్రమణల తొలగింపు

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెంలో పోలవరం కుడి కాలువ గట్టుపై ఆక్రమణలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం తొలగించారు. నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన ఒక వ్యక్తి పంగిడిగూడెంలోని పోలవరం కుడి కాలువ గట్టుపై దాదాపు మూడెకరాల భూమి ఆక్రమించాడు. గురువారం అర్ధరాత్రి హడావుడిగా ఫెన్సింగ్ ఏర్పాటు చేశాడు. ఆ సమయంలో స్థానికులు కొందరు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఏలూరు కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఝాన్సీరాణి, ద్వారకాతిరుమల తహసీల్దార్ సుందర్‌సింగ్, ఎస్సై టి.సుధీర్ తదితరులు అన్యాక్రాంత భూమిని పరిశీలించి, ఆక్రమణ జరిగినట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ఆక్రమితదారుడు భూమి చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను రెవిన్యూ, పంచాయతీ సిబ్బందిచే తొలగింపజేశారు. అనంతరం ఆ భూమిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్

కొవ్వూరు: సారా కేసుల్లో నిందితులైన నలుగురిని శుక్రవారం చాగల్లు మండల మేజిస్ట్రేట్ (తహసీల్దార్) ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్ఈబీ కొవ్వూరు ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. రామచంద్రపురం గ్రామానికి చెందిన జుత్తిక వెంకటలక్ష్మి, కలవలపల్లికి చెందిన కారింకి బుల్లెమ్మ, కొంజెర్ల సుబ్రహ్మణ్యం, చాగల్లులోని కొత్తపేటకు చెందిన వరిగేటి పాపలను బైండోవర్ చేసినట్టు ఆయన వివరించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- హోం మంత్రి తానేటి వనిత
- అన్నదేవరపేటలో గడప గడపకూ..


ఓ వృద్ధురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న మంత్రి తానేటి వనిత

తాళ్లపూడి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని అన్నదేవరపేట-2 సచివాలయం పరిధిలో శుక్రవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అధికారులతో కలసి హోం మంత్రి తానేటి వనిత ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్ లెట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ప్రజావసరాలు తెలుసుకుని మన ఇంటి ముంగిటకే సేవలు అందించడం సుపరిపాలనకు నిదర్శనం అన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణ దేవరాయులు, సర్పంచ్ ఎలిపే సుధారాణి, ఎంపీటీసీ సభ్యులు వి.స్వరాజ్యలక్ష్మి, నూతంగా కుమారి, నాయకులు పిట్టా శ్రీనివాస్, ఎం దొరబాబు, వల్లభని శ్రీహరి, ఎలిపే రాజు తదితరులు పాల్గొన్నారు.

విజయ పాల సేకరణ ధర రూ.2 పెంపు

మే 1 నుంచి అమలులోకి..

నల్లజర్ల: విజయ డెయిరీ పాల సేకరణ ధర లీటర్‌కు రూ.2 చొప్పున పెరుగుతోంది. పెంచిన ధరలు మే 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. ఆ వివరాలను విజయ డెయిరీ జిల్లా మేనేజరు బి.మూర్తి, పాల రైతుల అసోసియేషన్ అధ్యక్షుడు గంటా నాగేశ్వరరావు శుక్రవారం నల్లజర్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పది శాతం వెన్న ఉన్న లీటర్ పాలకు రూ.80 చొప్పున రైతులకు చెల్లిస్తామన్నారు. ఈ ఏడాది జనవరిలో పాలసేకరణ ధర రూ73 ఉండగా రూ.5 పెంచడంతో రూ.78కు చేరిందని వారు చెప్పారు. మే 1 నుంచి రూ.80 చొప్పున చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఇక 4.5 వెన్న శాతం ఉండే ఆవు పాల లీటర్ ధరను రూ.34.84 నుంచి రూ.36.14కు పెంచినట్టు వివరించారు. పశువులకు దాణాతో పాటు కృత్రిమ గర్భధారణ, 24 గంటలూ వెటర్నరీ సర్వీసులు, కల్యాణమస్తు, క్షీరబంధు పథకాల ద్వారా పాడి రైతులకు అండగా ఉంటున్నామన్నారు. నిర్దేశించిన కార్పొరేట్ ఆసుపత్రులలో పాడి రైతులు వైద్యం చేయించుకుంటే బిల్లులో 25 శాతం విజయ డెయిరీ చెల్లించే విధానాన్ని అమల్లోకి తీసుకు వస్తున్నట్టు చెప్పారు. విలేకరుల సమావేశంలో పాల సొసైటీ అధ్యక్షుడు యలమాటి ఆనంద్, అల్లూరి దుర్గారావు, నందమూరి రామకృష్ణ, యం.దుర్గరాజు, కె.మోహనరావు, పెండ్యాల వీరరాఘవులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు


ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ పంట ముందస్తు ప్రణాళికను విడుదల చేస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్

పెరవలి: రైతులందరూ ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తే, అది ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌కు దోహదపడుతుందని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం రెండు వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఈ విస్తీర్ణం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగం మండల ఇన్‌చార్జి బుజ్జి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ప్రభుత్వం ఎన్నో రకాల ప్రోత్సహకాలను అందిస్తోందన్నారు. ఈ తరహా సాగుకు ముందుకు వచ్చే రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.రమేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

నిడదవోలు రూరల్: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపట్టినట్టు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. మండలంలోని పురుషోత్తపల్లి, గోపవరం, విజ్జేశ్వరం గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ గంగరాజు మాట్లాడుతూ మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్ల సాయంతో రీ సర్వే చేపట్టామన్నారు. కచ్చితమైన సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తామన్నారు. మండల సర్వేయర్ పి.ధిలేశ్వరరావు, వీఆర్వోలు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ప్రకారం బోధన జరగాలి

చాగల్లు/ఉండ్రాజవరం: పాఠశాలల్లో సామాజిక తనిఖీపై హెచ్‌ఎంలకు శుక్రవారం మండలాల్లో శిక్షణ ఇచ్చారు. చాగల్లు జెడ్పీ హైస్కూల్లో రిసోర్స్‌పర్సన్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించేలా చూడాలన్నారు. పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి, వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. బడి బయట పిల్లలు లేకుండా, అలాంటి వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం, పాఠశాల భద్రత, పలు రకాల యాప్‌ల వినియోగం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈవో వి.ఖాదర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులతో ప్రేమగా మెలగాలన్నారు. అలాగే ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో ఎంఈఓ పీవీ నాగరాజు ఆ మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు మాస్టర్ రిసోర్స్ పర్సన్‌గా కె.శ్రీనివాసరావు వ్యవహరించారు.

ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.3 కోట్ల రుణాలు

తాళ్లపూడి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రక్కిలంక శాఖలో శుక్రవారం సాయంత్రం ఖాతాదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.3 కోట్ల రుణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారి రంగాచార్యులు, బ్రాంచి మేనేజర్‌ఎం ప్రకాష్, రైస్‌మిల్లర్స్ సంఘం అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, యాళ్ల బాబురావు తదితరులు పాల్గొన్నారు.